సాగులో శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి


మల్దకల్‌లో వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు

అలంపూర్/ ఎర్రవల్లి/ధరూరు/గట్టు/రాజోళి/ఇటిక్యాల: పంటల సాగులో రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండల పరిధిలోని వేముల, ధర్మవరం రైతు వేదికల్లో ముఖ్యమంత్రి ప్రారంభించిన రైతునేస్తం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, రైతులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పంటల సాగు, మెళకువలు, యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ చర్యల గురించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ సయ్యద్‌ఖాన్, ఏఓ రవికుమార్, ఏఈఓలు, రైతు సంఘాల నేతలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ మండలంలోని క్యాతూర్, లింగనవాయి, బుక్కాపురం గ్రామాల్లో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ పద్మావతి, మండల వ్యవసాయ శాఖ అధికారి నాగార్జున్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాఘవరెడ్డి, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించి రైతులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా ధరూరు మండలంలోని అన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీలత కోరారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు ప్రతాప్, శ్రీనివా స్‌రెడ్డి, ఏఈఓ నర్సింహులు, రైతులు పాల్గొన్నారు.

గట్టు మండలంలోని బోయలగూడెంలో తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్, ఏఈఓ భక్తవత్సల, ఆరగిద్దలో ఎంపీడీఓ చెన్నయ్య, ఏఈఓ తిరుమలేష్, గొర్లఖాన్‌దొడ్డి రైతు వేదికలో ఏఓ హనుమంతురెడ్డి, ఏఈఓలు రైతులతో కలసి రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం సందేశాన్ని రైతులకు వినిపించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రాజోళి మండలంలోని తూర్పుగార్లపాడులోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమం ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు వ్యవసాయ రంగంలో మెళుకువలు, యాజమాన్య పద్ధతులు వివరించారు. సీఎం నిర్వహించిన కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని రైతులకు తెలియచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్, ఏఈఓ ఇబ్రహీం, కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, దేవదాసు, హనుమంతు రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని తహసీల్దార్ వీర భద్రప్ప, ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ అన్నారు. ఇటిక్యాల మండల కేంద్రంతో పాటుగా చాగాపురం రైతువేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు పాల్గొన్నారు.

రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి అక్బర్ అన్నారు. మల్దకల్ రైతువేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ రాజశేఖర్, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


చాగాపురంలో రైతునేస్తం కార్యక్రమంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్


ఆరగిద్ద రైతువేదికలో రైతులతో కలసి కార్యక్రమాన్ని వీక్షిస్తున్న అధికారులు


వేములలో రైతు వేదికలో వీసీని వీక్షిస్తున్న అధికారులు, రైతులు


క్యాతూర్‌లో రైతు నేస్తం వీసీలో అధికారులు, రైతులు

క్లుప్తంగా

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

గట్టు: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ నల్లారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పరికరాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఎంఈఓ అభినందించారు. ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ఎంవీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరించండి సారూ..



మానవపాడు: మండలంలోని పల్లెపాడు గ్రామంలో గ్రామ పంచాయతీల్లో నిధులు లేవని దేవాలయం పక్కనే చెత్త ట్రాక్టర్ నిలిపేశారు. పంచాయతీ సిబ్బంది. ఈ నేపథ్యంలో దుర్వాసన వెదజల్లుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తతో దేవాలయం వద్ద ఉన్న ట్రాక్టర్ ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. సమస్యపై స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సంఘటనపై పంచాయతీ కార్యదర్శి నరేందర్‌రెడ్డి వివరణ కోరగా.. నిధులు లేనందున గ్రామంలోని వీధుల్లో చెత్త సేకరించడం లేదని పేర్కొన్నారు.

చెరువులకు చికెన్ వ్యర్థాల తరలింపు



ఎర్రవల్లి: పట్టపగలే చేపల చెరువులకు చికెన్ వ్యర్థాలను తరలిస్తూ కొందరు అక్రమార్కులు రూ. లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. సోమవారం పట్టపగలే ఓ బొలెరో వాహనంలో జింకలపల్లి సమీపంలో చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా స్థానిక రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ.. చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయి

అయిజ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని పులికల్ గ్రామంలో అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు శివర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన చేసిన బూత్‌స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రవి, భాను, అనిల్, మున్నా, నవీన్, శైలేందర్ పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి



ఇటిక్యాల: నాటిన ప్రతి మొక్కను ఏపుగా పెరిగే వరకు సంరక్షించాలని మండల ఆయుష్ శాఖ వైద్యాధికారి ముబీనా తబసుమ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో హరితయోగా ట్రీ ప్లాంటేషన్‌లో భాగంగా 18వ రోజు సిబ్బందితో కలిసి పాఠశాల పరిసరాలు శుభ్రం చేసి మొక్కలు నాటారు. భావితరాలు పొల్యూషన్ బారిన పడకుండా ఉండేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యోగా బోధకులు శివాని, నరేష్, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

మల్దకల్: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్ గ్రామస్తులకు సూచించారు. సోమవారం మండలంలోని బిజ్వారం గ్రామంలోని వివిధ కాలనీలు సందర్శించి గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపైకి వదలకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు స్వచ్ఛ భారత్‌కు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

భగీరథ పైపులైన్‌కు మరమ్మతు

మానవపాడు: మండలంలోని పెద్దఆముదాలపాడు గ్రామంలో సోమవారం మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయింది. వెంటనే స్పందించిన మిషన్ భగీరథ అధికారులు జేసీబీతో మరమ్మతు చేపట్టారు.

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

అయిజ: ఇటీవల పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరైన రైతులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జనార్దన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో వివిధ గ్రామాల రైతుల నుంచి ఏఈఓలు దరఖాస్తులు స్వీకరించారు. రైతు భరోసా దరఖాస్తు ఫాం, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డ్, బ్యాంక్ సేవింగ్ అకౌంట్ జిరాక్స్ సంబంధిత ఏఈఓకు అందజేయాలని సూచించారు.

బస్ చార్జీలను తగ్గించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం పెంచిన బస్‌చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం బస్‌చార్జీలతోపాటు విద్యార్థుల పాస్‌ల మీద కూడా చార్జీలు పెంచడం పేదవిద్యార్థులకు శరాఘాతంగా మారిందని, పెంపు నిర్ణయం వివిధ గ్రామాల నుంచి జిల్లాకేంద్రానికి వచ్చి చదువుకునే విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. సౌమ్య, సతీశ్, శివసాగర్, సాయి పాల్గొన్నారు.

మోదీ పాలనలో చారిత్రాత్మక నిర్ణయాలు


రాజోళిలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రాజోళి: ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవడంతో దేశం అభ్యున్నతి వైపు పరుగులు పెడుతుందని బీజేపీ సీనియర్ నాయకుడు రాజగోపాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రం రాజోళిలో మండల అధ్యక్షుడు శశికుమార్ ఆధ్వర్యంలో మోదీ ప్రభుత్వం సంకల్ప సహకారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370 రద్దు లాంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవడంతో పాటు, ఉగ్రవాదులపై కఠినంగా వ్యవహరించడంతో శత్రు దేశాలు మన దేశం వైపు కన్నెత్తి చూసేందుకు జంకుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో బీజేపీ మరింత బలపడి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, మల్లేష్, కొంకతి రాము, అడివిస్వామి పాల్గొన్నారు.


శాంతినగర్‌లో మాట్లాడుతున్న జయలక్ష్మి

దేశం అన్ని విధాల అభివృద్ధి చెందుతోంది

శాంతినగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు జయలక్ష్మి అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లోని బీజేపీ కార్యాలయంలో సంకల్పంతో సహకారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ కౌన్సిల్ మెంబర్ జయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన చట్టాలు, ఇబ్బందికరంగా ఉన్న సమస్యల పరిష్కారంలో ప్రధాని మోదీ ప్రత్యేక చొరవ చూపారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, నాయకులు రామకృష్ణ, నరసింహ, వెంకటేశ్వర్లు, సంజన్న, మోహన్, శివుడు, రాజశేఖర్, వినోద్, లక్ష్మన్న, పరుశరాముడు, సురేష్, రాఘవేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

కేటీదొడ్డి: మండల కేంద్రంలో మంగళవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హరికృష్ణ సోమవారం తెలిపారు. రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఉండవెల్లి: మండలంలోని బొంకూరు శివారులో 61, 154, 159 సర్వే నంబర్లలో ఉన్న పొలాన్ని వక్ఫ్ భూమిగా పరిగణించి తహసీల్దార్ ప్రభాకర్ వేలానికి అనుమతి ఇవ్వడంతో సోమవారం నంబర్లలో భూమి ఉన్న రైతులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బొంకూరు శివారులో సర్వే నంబర్ 61,154, 159 ఉన్న భూమి గతంలో వక్ఫ్ భూమిగా ఉండడంతో 2006 గెజిట్ నంబర్ 26–ఏలో ప్రచురించడంతో షేక్ హుస్సేన్ కుటుంబ సభ్యులు, చెన్నిపాడు గ్రామస్తులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, వక్ఫ్‌భూమి ఉన్నందున్న కోర్టు గెజిట్‌ను సస్పెండ్ చేసినా తహసీల్దార్ వక్ఫ్‌భూమి అని వేలానికి అనుమతించారని ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు.

బీచుపల్లిలో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పరమశివుడికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పశువులకు టీకాలు తప్పనిసరి


జూలెకల్‌లో ఆవుకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

శాంతినగర్: లంపీస్కిన్ వ్యాధితో పశువులు మృతి చెందే అవకాశం ఉందని, తప్పనిసరిగా నివారణ టీకాలు వేయించాలని శాంతినగర్ పశుసంవర్ధక శాఖ వైద్యురాలు స్వరూపరాణి సూచించారు. వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ గ్రామంలో సోమవారం పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. వైరస్ ద్వారా సోకే ఎల్ఎస్‌డీ వ్యాధి వల్ల పశువుల చర్మంపై పుండ్లు పడి రక్తం చిందుతుందన్నారు. ముందస్తు టీకాలతో వ్యాధి బారి నుంచి పశువులను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి


మాట్లాడుతున్న గోపి రజక

శాంతినగర్: రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చాలని రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు గోపి రజక డిమాండ్ చేశారు. రజక సంఘం సమావేశం సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. దేశంలోని 18 రాష్ట్రాల్లో రజక కులస్తులు ఎస్సీ రిజర్వేషన్లు అనుభవిస్తు అభివృద్ధి చెందుతున్నారన్నారు. మిగతా 11 రాష్ట్రాల్లో అవగాహన లేక ఆర్డినెన్స్ తెలియక రిజర్వేషన్ అమలు చేయలేక పోయారన్నారు. ఆయా రాష్ట్రాలు ఇప్పటికైనా స్పందించి లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 78 ఏళ్లుగా రజకులు ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ బాటలో నడుస్తానని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు.

అమర్‌నాథ్ కుటుంబ సభ్యులకు పరామర్శ : రజక కులస్తుల అభ్యున్నతి కోసం కృషి చేసి ఈ నెల 10న చనిపోయిన అమర్‌నాథ్ కుటుంబ సభ్యులను గోపి రజక పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, మండల అధ్యక్షుడు బందెన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా హాజరుకావాలి

అలంపూర్: విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని ఎంఈఓ అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని న్యూప్లాట్స్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం పంపిణీ చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పైబడిన 270 మందిని చిన్నారులను గుర్తించినట్లు తెలిపారు. అందులో 95 మందిని 1వ తరగతిలో చేర్పించినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

కేటీదొడ్డి: విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి వెంకటేశ్వర్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిధిలోని ఉమిత్యాల తండా, కొండాపురం పాఠశాలల్లో ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం, పుస్తకాల పంపిణీ

ధరూరు: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంతో పాటు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. మార్లబీడు ఉన్నత పాఠశాల, బూరెడ్డిపల్లి, ఓబులోనిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ఎంఈఓ రవీంద్రబాబు చేతుల మీదుగా పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు విజయ్, శివ, అమ్మ ఆదర్శ సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అలంపూర్‌లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ అశోక్‌కుమార్

కరుణించు.. నీలి మేఘమా


చెన్నిపాడులో విత్తనాలు నాటి సిద్ధంగా ఉంచిన పొలం

మానవపాడు: మండలంలో చెన్నిపాడు, మానవపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాల్లో 20 రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మే నెలలో విత్తనాలు విత్తుకున్న రైతులు ఎండలకు విత్తనాలు మురుగిపోతాయని, కొన్ని చోట్ల మొక్కలు ఎండుముఖం పడతాయోమనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి


అయిజలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న తహసీల్దార్ జ్యోతి

కేటీదొడ్డి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ హరికృష్ణ సూచించారు. మండలంలోని కొండాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ నెల 18 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 13 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్, ఆర్ఐ అశోక్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, భీమయ్య, లక్ష్మణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించలేదు.. రికార్డుల్లో తొలగించారు

గట్టు: ముంపునకు గురైన భూములకు పరిహారం చెల్లించ లేదు కానీ ఆన్‌లైన్‌లో మాత్రం భూములకు సంబంధించిన రైతుల పేర్లు తొలగించారంటూ రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం చాగదోన గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సును తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లో ముంపునకు గురైన 421, 437, 442, 449 సర్వే నంబర్లకు సంబంధించి సుమారు 30 మంది రైతులకు సంబంధించిన భూములు ముంపునకు గురైనట్లు తెలిపారు. వీటికి సంబంధించి నష్ట పరిహారం చెల్లించలేదన్నారు. ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు లేని కారణంగా రైతు భరోసా కూడా రావడం లేదని మాజీ సర్పంచ్ శంకరన్న, పరమేశ్వరయ్య, మహేశ్వర్‌గౌడ్, సామేలు, మధుకర్ తదితరులు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సదస్సులో మొత్తం 20 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.


రేవులపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

దరఖాస్తుల వెల్లువ

అయిజ: మండల కేంద్రంలో తహసీల్దార్ జ్యోతి, మండలంలోని కుటకనూరులో డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు.

73 దరఖాస్తుల స్వీకరణ

మానవపాడు: మండలంలోని నారాయణపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ పల్లి సతీష్‌రెడ్డి పాల్గొన్నారు. భూ సమస్యలపై 73 దరఖాస్తులు వచినట్లు పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 13 దరఖాస్తులు

ధరూరు : మండల పరిధిలోని బూరెడ్డిపల్లి, రేవులపల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 13 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీటీ అలివేలు మంగమ్మ, సీనియర్ అసిస్టెంట్ తిరుమలేష్, ఆర్ఐ పాల్గొన్నారు.

మహిళా సంఘాలు బలోపేతం కావాలి

రాజోళి: మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలని సెర్ప్ కార్యాలయ సీఆర్పీలు భాగ్యలక్ష్మి, కుసుమ కుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మహిళా సంఘాల బలోపేతంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా సంఘాలు అన్ని రకాలుగా బలోపేతం కావాలంటే ఎటువంటి కార్యాచరణ అమలు చేయాలి, సమావేశాలు ఎలా నిర్వహించాలనే అంశాలు వివరించారు. సంఘాల అభివృద్ధిపై సభ్యులు, సంఘాల లీడర్లు, సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పించారు. ఏపీఎం మార్తమ్మ, సీసీలు, గ్రామ సంఘం లీడర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



ఉండవెల్లి: మండలంలోని తక్కశీల జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు క్యాతూర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ముఖ్యంగా పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతుండడంతో అరికట్టేందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనితబాయ్, ఉపాధ్యాయులు నాగరాజు, సుందర్‌రెడ్డి, ఖాజాబాషా పాల్గొన్నారు.

నడిగడ్డ యువత జిల్లా అధ్యక్షుడికి సన్మానం



ఎర్రవల్లి: నడిగడ్డ యువత జిల్లా అధ్యక్షుడు పల్లె రాజును సోమవారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. వసంత్‌నగర్ యూత్ సభ్యులు కూడలిలో పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా విద్య, వైద్యం, ఆరోగ్యం ప్రజలకు అందించడంతో పాటు సమాజం పైన యువత ప్రభావం, నడిగడ్డ మార్పు కోసం స్థాపించిన స్వచ్ఛంద సంస్థలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి, యువకుడు సమాజంపై అవగాహన పెంచుకోవాలన్నారు.